సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ
ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన, శిథిల భవనాల మరమ్మతులకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. 8లో



నేటి నుంచి ఫార్మేటివ్ పరీక్షలు
పాఠశాలల్లో మంగళవారం నుంచి ఫార్మేటివ్ – 1/క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. 8లో



అర్జీలపై దృష్టిసారించాలి
జగనన్నకు చెబుదాంకు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జేసీ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. 8లో

విశాఖ.. భాగ్యరేఖ

- నేడు నగరానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక
- సీఎం చేతుల మీదుగా ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన
- రూ.864 కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్న ముఖ్యమంత్రి



సభా వేదిక వద్ద ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం : విశ్వనగరి విశాఖకు అంతర్జాతీయ బ్రాండింగ్ కల్పించేందుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే వేల కోట్లతో ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం మొత్తం రూ.864.88 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రహేజా గ్రూప్ సాలిగ్రామపురంలో నిర్మించనున్న ఇనార్బిట్ మాల్‌కు ముఖ్యమంత్రి భూమిపూజ చేస్తారు. ఫేజ్–1లో ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి రహేజా గ్రూప్ రూ.600 కోట్ల వ్యయం చేస్తోంది. 6 లక్షల చదరపు అడుగుల్లో మాల్, 4 లక్షల చదరపు అడుగుల పార్కింగ్ ప్రాంతం నిర్మించనుంది. 2026 కల్లా దీన్ని పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 250 జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్ స్టోర్స్, మల్టిప్లెక్స్‌లు, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్, ఫుడ్ కోర్టు, టెర్రస్ గార్డెన్, షాపింగ్ స్పేస్ రానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 వేల మందికి ఉపాధి కలగనుంది. అన్నీ కూడా గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు. ఫేజ్–2లో దాదాపు 3000 మంది ఉద్యోగులకు సరిపడేలా 2.5 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్, 2027 నాటికి సిద్ధమయ్యేలా ప్రణాళిక, ఫేజ్–3లో 200 గదులతో 4/5 స్టార్ హోటల్, 2029 నాటికి కార్యకలాపాలు ప్రారంభించే లక్ష్యం.

జీవీఎంసీ ప్రాజెక్టులకు శంకుస్థాపన

ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన అనంతరం.. అదే ప్రాంగణంలో నగర ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వివిధ ప్రాంతాల అభివృద్ధి, విశాఖ సుందరీకరణ ప్రాజెక్టులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అమృత్ 2.0, స్మార్ట్‌సిటీ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.135.88 కోట్లతో చేపట్టనున్న 50 పనుల్ని ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా జీవీఎంసీ అధికారులు పూర్తి చేశారు.



అభివృద్ధి పనుల్లో కొన్ని..

- **రూ.3 కోట్లతో** 66వ వార్డులో గాజువాక జంక్షన్ నుంచి వంటిల్లు జంక్షన్ వరకూ రహదారి విస్తరణ
- **రూ.2.40 కోట్లతో** జోన్–3 పరిధిలో జాతీయ **రహదారి జంక్షన్** నుంచి పెదవాల్తేరు జంక్షన్ **వరకూ ఎండ్ టూ** ఎండ్ రోడ్ విస్తరణ
- **రూ.2 కోట్లతో** జోన్–2లో పీఎంపాలెంలోని సాంకేతిక వైద్యవిధాన పరిషత్‌కు వెళ్లే మార్గం ఎండ్ టూ ఎండ్ రహదారి విస్తరణ
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రూ.1.33 కోట్లతో ఆర్ అండ్ బీ జంక్షన్, కాకానినగర్ జంక్షన్ అభివృద్ధి
- అమృత్ 2.0లో భాగంగా రూ.7.90 కోట్లతో భీమిలిలోని కొండపేట పంప్‌హౌస్ అభివృద్ధి
- క్రాంతినగర్, మిందే, తుంగ్లాం, చినగంట్యాడ, జగ్గరాజుపేట, నరవ, కొమ్మాది, లంకెలపాలెం, నాతయ్యపాలెం, చిల్లపేట చెరువులను రూ.30 కోట్లతో అభివృద్ధి పనుల నిర్వహణ
- రూ.3 కోట్లతో సాగర్‌నగర్ వద్ద, రూ.3.24 కోట్లతో డిఫెన్స్ క్వార్టర్స్ వద్ద యురోపియన్ స్టైల్‌లో ఈట్‌స్ట్రీట్స్ నిర్మాణం
- రూ.6 కోట్లతో వాల్తేరు మెయిన్ రోడ్డు నుంచి వీఎంఆర్‌డీఏ పార్క్ జంక్షన్ వరకూ స్మార్ట్ రోడ్డు నిర్మాణ పనులు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు



వేదిక వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి సురేష్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: కైలాసపురం వద్ద రహేజా గ్రూప్ నిర్మాణం చేపట్టనున్న ఇనార్బిట్‌మాల్ శంకుస్థాపన ఏర్పాట్లు పూర్తయ్యాయని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. సోమవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాల్ ప్రారంభమైతే వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రూ.139 కోట్ల వ్యయంతో నగర సుందరీకరణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో విశాఖ నగరం ప్రపంచ స్థాయి గుర్తింపు సంతరించుకోనుందన్నారు. ముందుగా జీవీఎంసీ మేయర్ హరివెంకటకుమారి కూడా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. తరువాత పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ మల్లిఖార్జున, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్‌చైర్మన్ కేకే రాజు కూడా శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పర్యటనలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజనీరు రవి కృష్ణంరాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రజా ఆరోగ్య అధికారి నరేష్ కుమార్, యూసీడీ పీడీ పాపునాయుడు, జోనల్ కమిషనర్లు, ఇనార్బిట్ మాల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒక్కో భవనం ఒక్కో ప్రత్యేకత

- ఏయూలో రూపుదిద్దుకున్న ఐదు భవనాలు
- నేడు ప్రారంభించనున్న సీఎం జగన్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి మంగళవారం విశాఖ నగర పర్యటనలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శిస్తారు. రూ.129 కోట్లతో చేపట్టిన ఐదు కీలక ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు.

– ఏయూక్యాంపస్

ఆ హబ్

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విద్యార్థులను ఆవిష్కర్తలుగా, భవిష్యత్ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే వేదికగా ఏయూ స్టార్టప్ అండ్ టెక్నాలజీ ఇంక్యుబేషన్ హబ్(ఆ–హబ్)ను తీర్చిదిద్దారు. ఇంజనీరింగ్ కళాశాలలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.21 కోట్లతో దీనిని నిర్మించారు. దీనిలో ఇప్పటికే 121 స్టార్టప్‌లు పనిచేస్తుండగా, వీటిలో 114 వరకు ఆర్థిక వనరులు సృష్టించే స్థాయికి చేరుకోవడం విశేషం.



ఎలిమెంట్



ఫార్మా, బయోటెక్, జెనోమిక్స్ ఇంక్యుబేషన్, టెస్టింగ్ ల్యాబ్ కోసం ఎలిమెంట్(ఏయూ ఫార్మా ఇంక్యుబేషన్ అండ్ బయోలాజికల్ మోనటరింగ్ హబ్)ని ఏర్పాటు చేశారు. రూ.44 కోట్లతో 55 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనం సిద్ధమైంది. ఔషధ రంగంలో స్టార్టప్, ఇన్నోవేషన్‌ని ప్రోత్సహించడం ఎలిమెంట్ ప్రత్యేకత.

ఏయూ సిబ్



ఏయూ అవుట్‌గేట్ వద్ద 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 18 కోట్లతో ఏయూ–సిబ్(ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్) నిర్మించారు. ఐఐఎం విశాఖపట్నంతో ఒప్పందంలో భాగంగా ఇంటర్నేషనల్ బిజినెస్ అండ్ అనలిటిక్స్‌లో బ్యాచిలర్, పీజీ కోర్సులు కేంద్రం ద్వారా అందిస్తారు.

ఏయూ–అవంతి



బీచ్‌రోడ్డులో ఏయూ–అవంతి ఆక్వాకల్చర్ ఇన్నోవేషన్ అండ్ స్కిల్ హబ్‌ని రూ.11 కోట్లతో 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. అవంతి ఫౌండేషన్‌తో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా మెరైన్ ఫార్మింగ్ రగంలో నైపుణ్య శిక్షణ, ఎంటర్‌ప్రెన్యూనర్‌షిప్‌ను ప్రోత్సహించే దిశగా ఈ కేంద్రం సేవలు అందిస్తుంది.

అల్గారిథమ్



ఏయూ డిజిటల్ జోన్ అండ్ స్మార్ట్ క్లాస్ రూమ్ కాంప్లెక్స్‌గా అల్గారిథమ్ నిలుస్తోంది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఎదురుగా 60వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ 35 కోట్ల వ్యయంతో అల్గారిథం నిర్మించారు. ఇందులో 250 మంది కూర్చునే రెండు సెమినార్ హాళ్లు, స్మార్ట్ క్లాస్ రూములు 15, ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు ఉపయుక్తంగా 500 కంప్యూటర్లు కలిగిన ఒక అంతస్తు కలిగి ఉంది.

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

1,300 మందితో బందోబస్తు

దొండపర్తి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. సుమారు 1300 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాల నిరంతర పర్యవేక్షణతో పాటు బందోబస్తును పలు కేటగిరీలుగా విభజించారు. ఒక్కో విభాగానికి ఒక్కో పోలీస్ ఉన్నతాధికారిని పర్యవేక్షణాధికారిగా నియమించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం పోర్టు ఆస్పత్రి వద్ద ఉన్న సాగరమాల కన్వెన్షన్ సెంటర్‌లో బందోబస్తులో విధులు నిర్వహించే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్ వద్ద పార్కింగ్, కాన్వాయ్, శంకుస్థాపన జరిగే ప్రాంతాలు, ఏయూ ప్రాంతాల్లో వీవీఐపీలకు బందోబస్తు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

- నగరంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి విఘాతం కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక పోలీసు సిబ్బందిని నియమించారు.
- వీఐపీలు పాల్గొనే ప్రాంతాల్లో స్నిఫర్ డాగ్, బాంబు బృందాలతో తనిఖీలు నిర్వహించారు. ఏఎస్‌సీ, ఆర్‌ఓపీలను నిర్వహిస్తూ సీఎం పర్యటించే రహదారులను తనిఖీ చేశారు.
- సీఎం పర్యటనలో పాల్గొనే ముఖ్య వ్యక్తుల వాహనాలకు, కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే ఇతరుల వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ చేసుకొనే విధంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు.
- ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో భారీ వాహనాలు రాకుండా మళ్లింపు చర్యలు చేపట్టారు.



మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

నూతన ప్రాజెక్టులతో విశాఖకు బ్రాండ్ ఇమేజ్ : మంత్రి అమర్

ఏయూక్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా మంగళవారం ప్రారంభంకానున్న ప్రాజెక్టులతో విశాఖ ఇమేజ్ మరింత పెరుగుతుందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సోమవారం ఆయన ఏయూలోని ఎలిమెంట్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో చేపడుతున్న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో విశాఖకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రూ.129 కోట్లతో సిద్ధం చేసిన ఐదు ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.మల్లికార్జున, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌కు ఘన వీడ్కోలు

సంప్రదాయబద్ధంగా పుల్లింగ్ అవుట్

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఈస్టర్న్ నేవల్ కమాండ్ బిస్వజిత్‌కు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికింది. ఐఎన్ఎస్ సర్కార్‌లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో వైస్ అడ్మిరల్ బిస్వజిత్ సెరిమోనియల్ గార్డ్‌ని తనిఖీ చేసిన అనంతరం ఫ్లాగ్ ఆఫీసర్స్, నేవల్‌షిప్స్, సబ్‌మెరైన్ల, వివిధ విభాగాధికారుల కమాండింగ్ అధికారులు నిర్వహించిన ప్లటూన్‌లను సమీక్షించారు. సంప్రదాయ బద్ధంగా నిర్వహించే పుల్లింగ్ అవుట్ సెరమనీలో బిస్వజిత్ పాల్గొన్నారు. 38 సంవత్సరాల పాటు నౌకాదళానికి విశిష్ట సేవలందించిన ఆయనకు ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ కేంద్రంగా తూర్పు నౌకాదళంలో తన చివరి విధులు నిర్వర్తించడం గర్వంగా ఉందన్నారు.



పుల్లింగ్ అవుట్ చేస్తున్న వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా

డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్‌గా విజయ్

సాక్షి, విశాఖపట్నం : నేవల్ డాక్‌యార్డు అడ్మిరల్ సూపరింటెండెంట్‌గా రియర్ అడ్మిరల్ విజయ్ శేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న రియర్ అడ్మిరల్ సంజయ్ సాధు వెస్టర్న్ నేవల్ కమాండ్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్(టెక్నికల్)గా బదిలీ అయ్యారు. సంజయ్ నుంచి విజయ్ బాధ్యతలు చేపట్టారు. విజయ్‌శేఖర్ 1988లో భారత నౌకాదళంలో చేరి 34 ఏళ్ల కెరీర్‌లో అనేక కీలకమైన బాధ్యతలు నిర్వర్తించారు. ఇండియన్ సబ్‌మెరైన్స్ ఐఎన్ఎస్‌వాగ్లీ, శంకుల్, షాల్కీతో పాటు ఐఎన్ఎస్ జ్యోతి వార్ షిప్‌కి ప్రాతినిధ్యం వహించారు. రక్షణ మంత్రిత్వ శాఖ ఇంటిగ్రేటెడ్‌హెడ్క్వార్టర్స్‌లో మెటీరియల్ అసిస్టెంట్ చీఫ్‌గా విధులు నిర్వర్తించారు. నేవల్ డాక్‌యార్డు విశాఖపట్నం, ముంబైలో పలు బాధ్యతలు చేపట్టారు.



సంజయ్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ్

యువతకు ఉపయుక్తంగా ఏయూలో వసతులు

ఏయూ క్యాంపస్: ఉత్తరాంధ్ర యువతకు ఉపయుక్తంగా ఏయూలో మౌలిక వసతుల కల్పన చేస్తున్నామని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ఏయూ సెనేట్ మందిరంలో ఏయూ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, మెరైన్ సైన్సెస్ రంగాల్లో నూతన ఆవిష్కరణలు జరిపే దిశగా యువతను ప్రోత్సహించడానికి ఐదు విభిన్న ప్రాజెక్టులను పూర్తి చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించనున్న ఈ ప్రాజెక్టులను ఉత్తరాంధ్ర యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుబంధ కళాశాలల్లో ఈ ఐదు భవనాల ప్రారంభోత్సవాలను విద్యార్థులకు ప్రత్యక్ష ప్రసారంలో చూపాలని సూచించారు. కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేకంగా తమ విద్యార్థులను ఏయూకు తీసుకువచ్చి ప్రత్యక్షంగా కూడా వీటిని చూడవచ్చునన్నారు. ఏయూలో గత మూడేళ్లలో 18 ప్రాజెక్టులను చేపట్టి పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార ఆచార్య వి.కృష్ణమోహన్, సీడీసీ డీన్ ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాళ్లతో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

మహారాణిపేట: జాతీయ నులిపురుగుల నివారణ దినం ఈ నెల 10న జరగనుంది. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఇతర అధికారులు ఆవిష్కరించారు. అనంతరం జేసీ విశ్వనాథన్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన అన్ని విద్యా సంస్థల్లో 1 నుంచి 19 సంవత్సరాల్లోపు బాల బాలికలకు నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు.

ఇండిగో విమానం ఆలస్యం

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): హైదరాబాద్‌కు వెళ్లాల్సిన ఇండిగో విమానం విశాఖపట్నం విమానాశ్రయంలో సాంకేతిక లోపంతో ఆలస్యంగా బయలు దేరింది. హైదరాబాద్ నుంచి సోమవారం ఉదయం 7.30 గంటలకు వచ్చి 8.10 గంటలకు తిరిగి హైదరాబాద్ బయలు దేరాల్సి ఉంది. ఆ సమయంలో సాంకేతిక లోపం తలెత్తడంతో నిలిచిపోయింది. ఎట్టకేలకు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బయలు దేరింది. దీంతో కొందరు ప్రయాణికులు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు.

థ్యాంక్యూ సీఎం సర్

- పదవీ విరమణ వయోపరిమితి పెంపుపై ఆచార్యుల హర్షం
- ఏయూలో ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఆచార్యుల పదవీ విరమణ వయోపరిమితిని 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచడంపై ఏయూ ఆచార్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జీవో 39ని విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఏయూలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల కొరతను కొంత వరకు నివారించడానికి ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు తమ ప్రమాణాలు కాపాడుకుంటూ జాతీయ, అంతర్జాతీయ ర్యాంకుల సాధనకు ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. థ్యాంకూ సీఎం సర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ముఖ్యమంత్రికి ఆచార్యుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య విజయ్‌మోహన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రీసెర్చ్–డెవలప్‌మెంట్ డీన్ ఆచార్య కె.బసవయ్య, తెలుగు విభాగాధిపతి జర్ర అప్పారావు, చీఫ్ లైబ్రేరియన్ పి.వెంకటేశ్వర్లు, వార్డెన్లు ఆచార్య కె.రమేష్‌బాబు, ఆచార్య ఎ.పల్లవి, ఆచార్య వెంకటరావు, డాక్టర్ ఎస్.ఎం.యుగంధర్, సి.వి.నాయుడు, అరుణ్ కుమార్, లిల్లీ గ్రేస్, గజపతిరాజు, రామకృష్ణ, జి.శాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం జగన్ విశేష కృషి


మాట్లాడుతున్న వీకేబీఏపీఎస్ఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివగణేష్‌శర్మ, ప్రతినిధులు

సింహాచలం: బ్రాహ్మణుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని విశాఖ కేంద్ర బ్రాహ్మణ అర్చక, పురోహిత సేవా సమాఖ్య సంఘం(వీకేబీఏపీఎస్ఎస్ఎస్) ప్రతినిధులు కొనియాడారు. సంఘం మూడో వార్షికోత్సవం సందర్భంగా విశాఖ పరిసర ప్రాంతాల్లోని అర్చక, పురోహితుల ఆత్మీయ సదస్సు సోమవారం సింహాచలంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నెమ్మలూరి శిగణేష్‌శర్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఈ నాలుగేళ్లలో బ్రాహ్మణులకు అనేక వరాలు ఇచ్చారన్నారు. ఎటువంటి హామీ లేకుండా బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పురోహిత్ మిత్రా కింద పురోహితులకు రూ.60వేలు చొప్పున రుణ సదుపాయం అందించారన్నారు. మృతిచెందిన బ్రాహ్మణులకు గరుడ స్కీమ్ కింద రూ.10వేలు చొప్పున అందించారని చెప్పారు. అర్చకులకు పదవీ విరమణ లేకుండా ఆలయాల్లో అర్చకత్వం చేసేందుకు వీలు కల్పించారన్నారు. ఇలా నిరంతరం బ్రాహ్మణుల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. బ్రాహ్మణులంతా ఐకమత్యంతో ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సమస్యలు, సలహాలు, సూచనలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సంఘం ప్రతినిధులు సోమయాజుల విజయ్‌కుమార్ శర్మ, ఎ.రాజేష్, బి.కైలాసపతి శివాచార్య, ఎస్.చంద్రశేఖర్, ఎం.తారానాథ్‌శర్మ, ఎ.నాగశాస్త్రి శివాచార్య, ఆర్.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా సీవో అప్పలకొండ సస్పెన్షన్

భీమునిపట్నం: జీవీఎంసీ మూడో వార్డు మహిళ సంఘాలకు చెందిన మెప్మా విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీవో) ఎం.అప్పలకొండ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులను అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (యూసీడీ) పాపునాయుడు జారీ చేశారు. గతంలో జోన్ – 2 పరిధి మధురవాడ ప్రాంతంలో ఈమె సీవోగా పని చేశారు. అప్పుడు అక్కడ ఒక రిసోర్స్ పర్సన్ (ఆర్‌పీ) మహిళ సంఘ సభ్యులు చెల్లించిన రూ.8 లక్షలకుపైగా నగదును బ్యాంకుకు చెల్లించకుండా మోసం చేశారు. దాంతోపాటు మరో సంఘానికి సంబంధించి రూ.11 వేలు చెలించలేదు. అప్పుడు సీవోగా పనిచేసిన అప్పలకొండ నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని తేలడంతో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంపై అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఏపీడీ) సంతోష్ కుమార్ సోమవారం మాట్లాడుతూ అప్పలకొండకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయని, వెంటనే ఆమెను విధుల నుంచి తొలగించామని తెలిపారు. అలాగే ఆమె స్థానంలో రెండో వార్డు సీవో విజయలక్ష్మిని ఇన్‌చార్జిగా నియమించామని వెల్లడించారు.

ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ

- మౌలిక సదుపాయాలు, భవనాల మరమ్మతులకు భారీగా నిధులు
- ఏఎంసీతో పాటు ఏడు ఆస్పత్రులకు రూ.10.15 కోట్లు మంజూరు
- ఈ నెల 15 నుంచి పనుల ప్రారంభానికి సన్నాహాలు


ఆంధ్ర వైద్య కళాశాల

మహారాణిపేట: మునుపెన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటికే వైద్య నిపుణుల నియామకంతో పాటు మౌలిక వసతుల కల్పన చేపట్టింది. గత నాలుగేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రులను నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దింది. తాజా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన, శిథిల భవనాల మరమ్మతులకు భారీగా నిధులు మంజూరు చేసింది. దీంతో విశాఖ నగరంలో ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ పట్టనుంది.

రూ.10.15 కోట్లు మంజూరు

నగరంలోని ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ)తో పాటు పలు ఏడు ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.10.15 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆంధ్ర వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న కేజీహెచ్‌తో పాటు ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి(ఘోషాస్పత్రి), ప్రాంతీయ కంటి ఆస్పత్రి, రాణి చంద్రమణి దేవి ఆస్పత్రి(ఆర్‌సీడీ), విమ్స్, ఈఎన్‌టీ, ప్రభుత్వ ఛాతి ఆస్పత్రుల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. నిధుల వినియోగానికి పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సంస్థ(ఏపీ ఎంఎస్ఐడీసీ) ఇంజినీరింగ్ అధికారులు ఈ పనులకు టెండర్లు పిలిచారు. త్వరలో టెండర్లు ఖారారు చేయనున్నారు. ఈనెల 15వ తేదీ నుంచి పనులు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

నిధుల కేటాయింపు ఇలా..

ఆస్పత్రి	కేటాయించిన నిధులు
కేజీహెచ్	రూ.3.10 కోట్లు
ఏఎంసీ	రూ.1.05 కోట్లు
ఘోషాస్పత్రి	రూ.1.32 కోట్లు
విమ్స్	రూ.2.5 కోట్లు
ఆర్‌సీడీ	రూ.83 లక్షలు
కంటి ఆస్పత్రి	రూ.60 లక్షలు
టీబీ ఆస్పత్రి	రూ.40 లక్షలు
ఈఎన్‌టీ ఆస్పత్రి	రూ.35 లక్షలు

భర్త కళ్లెదుటే భార్య దుర్మరణం


దాసరి అపర్ణ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం / అనకాపల్లి టౌన్: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో భార్య తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక ఎస్‌ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా కొత్తవలస గ్రామానికి చెందిన దాసరి సత్తిబాబు, భార్య అపర్ణ (26) ఉపాధి కోసం అనకాపల్లి ప్రాంతానికి ఐదు సంవత్సరాల క్రితం వలస వచ్చారు. పట్టణంలోని అంజయ్యకాలనీలో అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. వీరికి భరత్ (6), షణ్ముఖ్ (4) సంతానం. పిల్లలు సమీపంలోని పాఠశాలలో చదువుతున్నారు. సత్తిబాబు పట్టణంలోని ఓ షాపింగ్ మాల్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ నగరంలోని దొండపర్తి వద్ద ఉన్న బంధువులను కలిసేందుకు సత్యం, అపర్ణ సోమవారం ఉదయం బయలుదేరారు. ఈ క్రమంలో వీరు ప్రయాణిస్తున్న స్కూటీ బీహెచ్‌పీవీ సిగ్నల్ పాయింట్ దాటి నాతయ్యపాలెం సమీపిస్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో స్కూటీ వెనుక కూర్చున్న అపర్ణ తూలి రోడ్డుపై పడగా ఆమె తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. భర్త సత్యంకు తీవ్ర గాయాలయ్యాయి. కళ్లెదుటే భార్య మృతి చెందడాన్ని చూసిన సత్యం రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న గాజువాక ఇన్‌చార్జి సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ కొల్లి సతీష్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయాలపాలైన సత్యంను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు. ఈ దుర్ఘటనతో అనకాపల్లి అంజయ్యకాలనీలో విషాదం నెలకొంది.

కోలా గురువులు ప్రమాణ స్వీకారం రేపు


అనుబంధ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

మహారాణిపేట: మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డులో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు తాను బాధ్యతలు స్వీకరిస్తానని, ఈ కార్యక్రమనికి పార్టీ నాయకులు, కార్యకర్తలు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల శివగణేష్(యువజన విభాగం), ఆడ్డాల కృపా జ్యోతి(మహిళా విభాగం), వంకాయల మారుతీప్రసాద్(వైఎస్ఆర్ సేవాదళం విభాగం), మాన్యాల శ్రీనివాస్(బీసీ విభాగం), బోని శివరామకృష్ణ(ఎస్‌సీ విభాగం), పెంద్ర అప్పన్న(ఎస్‌టీ విభాగం), కె.వి.బాబా(మైనారిటీ విభాగం), నమ్మి లక్ష్మణరావు(విద్యార్థి విభాగం), లెంక రాంబాబు (పంచాయతీ రాజ్ విభాగం), వానపల్లి ఈశ్వరరావు(వాణిజ్య విభాగం), బయ్యవరపు రాధ (సాంస్కృతిక విభాగం), బోండా ఉమామహేశ్వరరావు(ఐటీ విభాగం), కోరాడ అప్పలస్వామినాయుడు (వికలాంగుల విభాగం), ఎజ్జల ప్రేమబాబు(గ్రీవెన్స్ విభాగం), తిప్పల వంశీరెడ్డి(సోషల్ మీడియా విభాగం) తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక క్రీడాకారులకు ఏపీఎల్ చక్కటి ప్లాట్‌ఫాం

- చారుశర్మ ఆధ్వర్యంలో నేడు ఆటగాళ్ల వేలం
- వైఎస్సార్ స్టేడియం వేదికగా 16 నుంచి రెండో సీజన్


చారుశర్మ

విశాఖ స్పోర్ట్స్: చారుశర్మ కామెంటేటర్‌గానే తెలుసు. గతంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ జట్టుకు సీఈవోగా సేవలందించారు. ఈయనకు ఏపీఎల్‌తోనూ అనుబంధం ఉంది. ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్ ఈ నెల 16 నుంచి విశాఖ వైఎస్ఆర్ స్టేడియం వేదికగా ప్రారంభం కానుంది. ఆంధ్రాకు చెందిన ఆరు ఫ్రాంచైజీ జట్లు ఈ టోర్నీలో తలపడుతున్నాయి. ఈ జట్లకు ఆడేందుకు ఆంధ్రా నుంచి 567 మంది ఆటగాళ్లు సిద్ధమవుతున్నారు. వీరందరితో మంగళవారం చారుశర్మ ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నారు. అందుకు విశాఖలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏపీఎల్ తొలిసీజన్‌లో ఆటగాళ్ల వేలంను చారుశర్మ ఆధ్వర్యంలోనే జరిగింది. మరోసారి వేలం జరగనున్న సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐపీఎల్ తరహాలో ఏపీఎల్ కూడా ఔత్సాహిక క్రీడాకారులకు ఓ చక్కటి ప్లాట్‌ఫాం అని చెప్పారు.

డీజిల్ అక్రమంగా తరలిస్తున్న ట్యాంకర్ పట్టివేత

దొండపర్తి : డీజిల్ అక్రమంగా తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ట్యాంకర్‌ను అదుపులోకి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అక్రమంగా డీజిల్ తరలిస్తున్నట్టు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ స్వరూపారాణి ఆధ్వర్యంలో బృందం ఆటోనగర్‌లో వాహన తనిఖీలు నిర్వహించింది. ఒక ఆయిల్ ట్యాంకర్‌ను ఆపగా డ్రైవర్ కిందకు దిగి వెంటనే పరారయ్యాడు. ట్యాంకర్ నంబర్‌తో వాహన యజమాని వివరాలను సేకరించారు. దాని రిజిస్ట్రేషన్ ప్రకారం సీతమ్మధారలో ఆయిల్ ట్యాంకర్ యజమాని ఉన్నట్లు గుర్తించి అతనికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆ ట్యాంకర్‌ను పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. మంగళవారం యజమాని ఫోన్‌కు స్పందించకుంటే ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకొని విచారించాలని విజిలెన్స్ అధికారులు భావిస్తున్నారు. టాంకర్‌లో డీజిల్ లేదా బ్లాక్ ఆయిల్ ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

న్యాయవాది హత్యకు నిరసనగా విధుల బహిష్కరణ

విశాఖ–లీగల్: విజయవాడ న్యాయవాదుల సంఘానికి చెందిన న్యాయవాది ఆర్.ఆదిశేషు విటల్‌బాబు దారుణ హత్యపై విశాఖ న్యాయవాద సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు విశాఖ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం విధులు బహిష్కరించారు. న్యాయవాదులు బంద్ పాటించారు. వ్యక్తిగత కక్షతో సీనియర్ న్యాయవాదిని దారుణంగా హత్య చేశారని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు కోరారు. విశాఖ న్యాయవాదులు సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు ,రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ అరుణ్ కుమార్, ఉపాధ్యక్షురాలు బి.ఎల్.లలిత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫార్మేటివ్ – 1 పరీక్షలు

- ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నాపత్రాలతోనే పరీక్షలు
- ప్రైవేటు స్కూళ్లలోనూ అమలు చేయాల్సిందే
- ప్రభుత్వ స్కూళ్లలో తొలిసారిగా టోఫెల్ పరీక్ష

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో మంగళవారం నుంచి ఫార్మేటివ్ – 1 / క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 4 వరకు పరీక్షలు జరగనున్నాయి. వీటి నిర్వహణకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల విద్యాశాఖాధికారులు అంతా సిద్ధం చేశారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి ఇవే తొలి పరీక్షలు కావడం, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా టోఫెల్ పరీక్ష నిర్వహిస్తుండడంతో విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో ప్రైవేటు పాఠశాలల్లో సొంతంగా తయారు చేసుకున్న ప్రశ్నాపత్రాలతో పరీక్షలు నిర్వహించుకునేవారు. కానీ ప్రస్తుతం రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన పాఠ్య పుస్తకాలతోనే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బోధన సాగుతున్నందున, ఒకే విధానంలో పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖాధికారులు ఆదేశించారు. ప్రశ్నాపత్రాలను కూడా ఎస్‌సీఈఆర్‌టీ ద్వారానే సరఫరా చేస్తున్నారు. క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ నిర్వహణ కోసం ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులందరికీ ఎస్‌సీఈఆర్‌టీ తయారు చేసిన ప్రశ్నాపత్రాలతోపాటు, ఓఎమ్మార్ షీటు కూడా ఇస్తారు. జవాబులను ప్రశ్నాపత్రంలో టిక్ చేయటంతోపాటు రాయాలి. అదేవిధంగా ఓఎమ్మార్ షీట్‌లో బబుల్ చేయాలి. పరీక్షలకు అవసరమైన సామాగ్రిని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా పాఠశాలలకు సరఫరా చేశారు.

టోఫెల్ పరీక్ష ఏర్పాట్లు

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన సాగుతున్న నేపథ్యంలో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు తొలిసారిగా 'టోఫెల్' పరీక్ష నిర్వహిస్తున్నారు. 'ఇంగ్లిష్ పేపర్ పార్ట్ – బీ'లో టోఫెల్‌కు సంబంధించిన అంశాలు ఉంటాయి. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, స్మార్ట్ టీవీలు అందుబాటులో ఉన్న పాఠశాలల్లో టోఫెల్ పరీక్షను తప్పనిసరిగా నిర్వహించాలని, మిగతా చోట్ల ఉపాధ్యాయుల ఆసక్తి మేరకు నిర్వహించొచ్చని విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టిసారించాలి

- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్
- జగనన్నకు చెబుదాంకు 299 వినతులు

మహారాణిపేట: జగనన్నకు చెబుదాంకు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. నిర్ణీత సమయంలోగా వీటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీటికి అధిక ప్రాధాన్యవ ఇచ్చి అవసరమైతే వ్యక్తిగతంగా తనిఖీ చేసి సంతృప్తికరంగా పరిష్కార మార్గం చూపించాలన్నారు. పెండింగ్ బియాండ్, రీ ఓపెనింగ్ లేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కారించాలన్నారు. మొత్తంగా 299 వినతులు అందాయి. ఇందులో రెవెన్యూశాఖ నుంచి 130, జీవీఎంసీ నుంచి 68, పోలీసు శాఖ నుంచి 29, ఇతర ప్రభుత్వశాఖల నుంచి 72 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీనివాస మూర్తి, పోలీసు అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం

- జగనన్నకు చెబుదాంకు 92 వినతులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 92 ఫిర్యాదులు వచ్చాయి. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వినతులు స్వీకరించారు. జోన్–1 నుంచి 2, రెండో జోన్ నుంచి 16, మూడో జోన్ నుంచి 13, నాల్గో జోన్ నుంచి 8, ఐదో జోన్ నుంచి 13, ఆరో జోన్ నుంచి 12, ఏడో జోన్ నుంచి 2, ఎనిమిదో జోన్ నుంచి 8, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 18 ఫిర్యాదులు అందాయి. ఈ వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనరు డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, డీసీపీ నరేంద్రరెడ్డి, కార్యదర్శి పి నల్లనయ్య, డీసీ(రెవెన్యూ) ఫణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 53 ఫిర్యాదులు


ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి : స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 53 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు తీరుపై 'ఉక్కు' పిడికిలి

- పోర్టును ముట్టడించిన స్టీల్‌ప్లాంట్ కార్మికులు
- గంగవరం పోర్టు వద్ద ఉద్రిక్తత


ఆందోళనకారులను నిలువరిస్తున్న పోలీసులు

గాజువాక/పెదగంట్యాడ : స్టీల్‌ప్లాంట్ ముడిసరకును అన్‌లోడింగ్ కాకుండా అడ్డుకుంటున్న గంగవరం అదాని పోర్టు యాజమాన్యం తీరుపై ఉక్కు కార్మికులు కన్నెర్రజేశారు. ఈ విషయంలో అనవసరమైన ఆటంకాలు కలిగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పోర్టు ముట్టడికి ప్రయత్నించారు. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ జంక్షన్ నుంచి సోమవారం ర్యాలీగా వచ్చిన కార్మికులు ఒక్కసారిగా పోర్టులోపలికి చొచ్చుకుపోవడానికి ప్రయత్నించారు. అప్పటికే అక్కడ మోహరించి ఉన్న పోలీసులు వారిని అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, దీన్ని ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తే సహించేది లేదంటూ కార్మికులు ముక్తకంఠంతో నినదించారు. ప్లాంట్‌ను ప్రభుత్వరంగం సంస్థగానే కొనసాగించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు శాశ్వత గనులు కేటాయించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం తన వైఖరిని మార్చుకోవాలని, లేనిపక్షంలో పోర్టుకు సరకు రవాణా కాకుండా రైల్వే ట్రాక్‌లను ముట్టడిస్తామని హెచ్చరించారు. గంగవరం పోర్టు కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం 26 రోజులుగా పోరాడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించని యాజమాన్యం ఇప్పుడు ఉక్కు కార్మికులతో గొడవ పడటానికి సిద్ధమవుతుందన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.నర్సింగరావు, కార్పొరేటర్ గంగారావు, కార్మిక సంఘాల నాయకులు అయోధ్య రామ్, ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర వికేంద్రీకరణ జేఏసీ సంఘీభావం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉద్యమానికి ఉత్తరాంధ్ర పరిపాలనా వికేంద్రీకరణ జేఏసీ సంఘీభావం ప్రకటించింది. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చేపట్టిన నిరాహార దీక్షలు 900 రోజులు పూర్తయిన సందర్భంగా జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, ఉపాధ్యక్షుడు దేవుడు మాస్టారు దీక్ష శిబిరానికి వచ్చి మద్దతు ప్రకటించారు. ప్రజల మనోగతాన్ని అర్థం చేసుకుని ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు కేంద్రాన్ని అభ్యర్థించారు.

ఎగుమతి, దిగుమతిదారులకు ప్రోత్సాహకాలు


పుస్తకం ఆవిష్కరిస్తున్న డైరెక్టరేట్ ఆఫ్ ఫారిన్‌ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) జాయింట్ డైరెక్టర్ బీఎస్ రమేష్

సీతంపేట: ఎగుమతి, దిగుమతిదారులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు డైరెక్టరేట్ ఆఫ్ ఫారిన్‌ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) జాయింట్ డైరెక్టర్ బి.ఎస్.రమేష్ పేర్కొన్నారు. సిరిపురం వీఐపీ రోడ్‌లోని ఓ హోటల్‌లో డీజీఎఫ్‌టీ విశాఖపట్నం, పోస్టుమాస్టర్ జనరల్ విశాఖపట్నం సంయుక్తంగా ఎగుమతిదారులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగుమతి, దిగుమతులకు సులువైన మార్గాలను వివరించారు. డీజీఎఫ్‌టీ యంగ్ ప్రొఫెషనల్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఎగుమతి విధానంలో డాక్యుమెంటేషన్, ఈ కామర్స్, ఫారిన్ ట్రేడ్ పాలసీ – 2023 విధానాలు వివరించారు. పోస్టు మాస్టర్ జనరల్ విశాఖపట్నం రీజియన్ కల్నల్ వి.రాములు మాట్లాడుతూ పోస్టల్ డిపార్టుమెంట్ కూడా ఎగుమతి, దిగుమతి సేవలను ప్రారంభించిందన్నారు. డాక్ఘర్ నిర్యాత్ కేంద్రం ద్వారా ఈ సేవలు అందజేస్తున్నామన్నారు. అడిషనల్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ ఆర్.వి.ప్రదమేష్ మాట్లాడుతూ ఎగుమతి ట్రేడ్ ఫెసిలిటేషన్, మెజర్స్ గురించి వివరించారు. డీజీఎఫ్‌టీ సెక్షన్ హెడ్ ఎస్.వి.రంగనాథన్, పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.రాహుల్, ఈసీజీసీ బ్రాంచి మేనేజర్ ఎ.బి.పి.ఎల్.మిశ్రా, ఎంపీఈడీఏ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ నాయక్, ఏపీచాప్టర్ హెడ్ ఎఫ్ఐఈవో, అసిస్టెంట్ డైరెక్టర్ రఘునాథ్‌బాబు, టీఎక్స్‌బీ రీజినల్ హెడ్ సురేష్‌జయ, ఐసీఐసీఐ అకౌంట్స్ మేనేజర్ నటరాజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'హౌ టు ఎక్స్‌పోర్ట్ ఏ ప్రాక్టికల్ గైడ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు.